

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761



బుధవారం | 07-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 802 పేజీలు: 4 వెల : రూ.7


# మేమేం చేశాం.. పాపం









శ్రీకాకుళం/ఎచ్చెర్ల, అక్టోబర్ 6 (వార్త): పాపం.. ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో గాని, నవమోసాలు మోసిన పిల్లలకు గడ్డి మందు తాగించి, ఆపై తాను తాగిన ఘటన ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. ఆ ముగ్గురు అపస్మారకస్థితికి చేరుకోగా వారిని బంధువులు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఎనిమిది నెలల కుమారుడితో పాటు తల్లి తనువు చాలించగా, రెండేళ్ల కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. వివరాల్లోకి వెళితే.. హిరమండలం మండలం కొండరాగోలు గ్రామానికి చెందిన మీనా(25)కు చిలకపాలెం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ జగదీష్‌తో మూడేళ్ల కిందట పెళ్లయింది. వీరికి గాయత్రి (2), కుమారుడు కులదీప్ (8 నెలలు) ఉన్నారు. భార్యభర్తలు అన్యోన్యంగానే ఉండేవారు. అయితే మీనా కుమారి మానసికంగా ఇబ్బంది పడుతుండేది. తరచూ పీడకలలు వస్తున్నాయని ఆమె తల్లిదండ్రులతో పాటు అత్తమామల వద్ద వాపోయేది. దీంతో వారు ఆమెకు తాయత్తు కూడా కట్టించారు. భర్త జగదీష్ లారీ డ్రైవర్. ఏమైందో ఏమోగాని మీనా ఇంట్లో ఉన్న గడ్డి మందును మంగళవారం ఉదయం ఇద్దరు పిల్లలకు పాలలో కలిపి తాగించింది. ఆ తర్వాత తానూ తాగింది. మీనా బాత్‌రూమ్‌లో వాంతులు చేసుకుంటుండగా, కుటుంబీకులు చూశారు. గడ్డి మందు వాసన రావడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా పిల్లలు మంచంపై అపస్మారక స్థితిలో పడిఉన్నారు. వెంటనే ఆ ముగ్గురినీ చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మీనా తల్లి అమ్మాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. తల్లి, బిడ్డ మృతి చెందడం, మరో బిడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

☀ ఇద్దరు పిల్లలకు గడ్డి మందు తాగించిన ఓ తల్లి ☀ ఆ పై తాను తాగి తనువుచాలించిన తల్లి ☀ ఎనిమిది నెలల కుమారుడు మృతి, చికిత్స పొందుతున్న రెండేళ్ల చిన్నారి ☀ ఏం కష్టమొచ్చిందో.. ఆ తల్లికి ☀ ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో విషాద ఘటన

## విదేశీ ఉద్యోగం పేరిట..

# ఉద్దానం యువతకు టోకరా!



☀ బ్రోకర్ల వలలో పడుతున్న అభ్యర్థులు ☀ విదేశాల్లో ఉద్యోగమంటూ నమ్మబలుకున్న దళారులు ☀ వీసాల్లో కూడా మోసం ☀ రూ.లక్షలు వసూలు చేస్తున్న వైనం ☀ విదేశాల్లో చిక్కుకుని ఇండియా రాలేకపోతున్న నిరుద్యోగులు ☀ కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



మందస, అక్టోబర్ 6 (వార్త): నిరుద్యోగం తాండవిస్తుండడంతో కొంతమంది బ్రోకర్లు నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. విదేశాలలో ఉద్యోగులు పేరిట నిలువునా ముంచేస్తున్నారు. మోసం చేస్తున్న దళారులపై కఠిన చట్టాలు లేకపోవడంతో యథేచ్ఛగా ఈ దందా కొనసాగుతోంది. ముఖ్యంగా ఉద్దానం నిరుద్యోగులను టార్గెట్ చేసుకుని, బ్రోకర్లు హవా నడిపిస్తున్నారు. లక్షల రూపాయలు వసూలు చేసి, నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలే లక్ష్యంగా దళారులు కన్నేసి, వారిని మోసం చేస్తున్నారు. పెద్ద పెద్ద చదువులు చదివి, తల్లిదండ్రులు, కుటుంబాన్ని ఉద్ధరిస్తామనుకుని, దళారుల మాయలో పడి, అన్యాయానికి గురవుతున్నారు. రూ.లక్షలు పోసి, ఉద్యోగమంటూ విదేశాలకు వెళ్లి ఉద్దానం యువత మోసపోతున్నారు. విదేశాలకు వెళ్లిన అనంతరం బ్రోకర్ల బండారం బయట పడుతోంది. ఉద్యోగం లేదు సరికదా.. తీసుకెళ్లిన డబ్బు సరిపోక.. చాలీచాలని తిండితో తమ దయనీయ దుస్థితిని కుటుంబీకులు వివరిస్తున్నారు. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవల ఉద్దానంలో జరుగుతున్న సంఘటనలతో ఆయా కుటుంబాలు కలత చెందుతున్నాయి. ఉద్యోగం మాట దేవుడెరుగు.. కనీసం తమ పిల్లలు క్షేమంగా ఇంటికి వస్తే చాలు అనుకుంటూ.. భగవంతునికి పూజలు చేస్తున్నారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో విదేశాల ఉద్యోగాల దందా సాగుతోంది. ఒకసారి మోసం చేసిన బ్రోకర్లకు కఠిన శిక్షలు లేకపోవడంతో మళ్లీ ఇదే మోసాలను వృత్తిగా సాగిస్తున్నారు. సోంపేట మండలంలోని ఎర్రముక్కం గ్రామానికి చెందిన చీకటి సాయివంశీ, వజ్రపుకొత్తూరు మండలంలోని ఒంకులూరు గ్రామానికి చెందిన లండ తరుణ్, గడూరు గ్రామానికి చెందిన చొక్కర సాయికుమార్ ఈ ముగ్గురు యువకులు సందర్శన వీసాతో మలేషియా వెళ్లి ఇమ్మిగ్రేషన్ అధికారులకు చిక్కి బందీలయ్యారు. వీరు ఇక్కడి ఓ ఏజెంట్‌కు మలేషియా వెళ్లేందుకు సుమారు రెండు లక్షల రూపాయలు చొప్పున చెల్లించారు. అతని ద్వారా తీసుకున్న సందర్శన వీసాతో ఆగస్టు 12న మలేషియా వెళ్లారు. కొద్దిరోజులుగా పిల్లలు నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులంతా ఆందోళన చెందారు. అక్కడ స్థానికుల ద్వారా పోలీసులకు చిక్కారని తెలుసుకొని తమ కుమారులను స్వగ్రామాలకు రప్పించండంటూ





బాధిత కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెండాళం అశోక్ బాబు వద్ద విన్నవించుకున్నారు. నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి

రప్పిస్తామని చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసిందని, కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలనని, బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ, విప్ అశోక్ బాబు హామీ ఇచ్చారు. ఎంఎల్‌ఏ అశోక్ బాబును కలిసిన వారిలో సోంపేట మాజీ జడ్పీటీసీ సూరాడ చంద్ర మోహన్, పాపారావు, సాయి, గురు, కళావతి, కామేశ్వరి ఉన్నారు. విదేశాల్లో చిక్కుకున్న నిరుద్యోలను స్వగ్రామాలకు తీసుకురావాలని బాధిత కుటుంబాలు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెండాళం అశోక్ వద్ద విన్నవించుకున్నారు. నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తామన్నారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పీడీఎస్ రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

* జలుమూరు మండలంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారుల సంయుక్త తనిఖీలు
* ఆటోలో తరలిస్తున్న 12 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం
* రూ.22,750 విలువైన బియ్యంతో పాటు ఆటో సీజ్
* పర్లాకిమిడికి తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

**జలుమూరు, అక్టోబర్ 6 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. జలుమూరు మండలం చల్లవానిపేటలోని నీలమణి అమ్మవారి గుడి సమీపంలో ఈ తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వెలుగులోకి వచ్చింది. అధికారుల వివరాల ప్రకారం.. జలుమూరు మండలం గుగ్గిలి గ్రామం నుంచి ఒడిశాలోని పర్లాకిమిడికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఓ ఆటోను తనిఖీ చేయగా అందులో 12 బస్తాల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 6,000 కిలోల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆటో డ్రైవర్ గుగ్గిలి గ్రామానికి చెందిన కోరాడ గోవిందరావు.. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి పర్లాకిమిడిలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.22,750 ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యంతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన ఆటోను కూడా అధికారులు సీజ్ చేశారు. కోరాడ గోవిందరావును అదుపులోకి తీసుకుని ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్–1955లోని సెక్షన్ 6–ఏ కింద తదుపరి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ రామారావు, రెవెన్యూ అధికారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



### మెరుగైన వైద్య సేవలు అందించేందుకే..

# విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* వర్చువల్ విధానంలో ప్రారంభించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




**శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త):** విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య అధికారులను కోరారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన 24 జిల్లాలలో, 267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా జనార్ధనపురం వేదిక నుంచి వర్చువల్‌గా మంత్రి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలు కలిగిన నాయకుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది బాధ్యతాయుతంగా సేవలు అందించాలని ఆయన సూచించారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయం వేదికగా నిర్వహించిన ఈ వర్చువల్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ముఖ్యఅతిథిగా పాల్గొని జి. సిగడాం మండలం సేతు భీమవరం గ్రామంలో 37.20 లక్షల వ్యయంతో, సారవకోట మండలం, కిన్నెర వాడ గ్రామంలో 38.8 లక్షలు వ్యయంతో, గార మండలం అంపోలు, చల్లపేట గ్రామం లో 29.80 లక్షలు వ్యయంతో, నరసన్నపేట మండలం, నరసన్నపేటలో 32 లక్షల వ్యయంతో, గార మండలం శ్రీకూర్మం, ఎస్. మత్స్యలేశంలో 25 లక్షలు వ్యయంతో ఎన్.ఆర్.ఈ.జీఎస్ , ఎన్.హెచ్.ఎం. నిధులతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్– విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలసి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వర్చువల్ విధానంతో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన గ్రామ ఆరోగ్య సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్యం, సాధారణ ఆరోగ్య పరీక్షలు, అవసరమైన మందుల అందజేత, తల్లి–శిశు ఆరోగ్య సేవలు, వ్యాధులపై అవగాహన, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు ప్రజలకు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. డిజిటల్ సేవలు, 104 సేవలు, వ్యాక్సినేషన్ మొదలగు 12 రకాల సేవలను నూతన గ్రామ ఆరోగ్య సెంటర్ల ద్వారా అందించబడుతుందని తెలిపారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయని, గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సెంటర్లలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ఆధ్వర్యంలో ఏ.ఎన్.ఎం.లు, ఆశా వర్కర్లు రోగులకు సేవలు అందిస్తారని తెలిపారు. ప్రాథమిక వైద్యం అత్యంత ఆవశ్యకమని, ప్రధమ చికిత్స గ్రామ స్థాయిలోనే జరగాలని అన్నారు. స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వైద్య సలహాలు పొందాలని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ ఆరోగ్య సెంటర్లు“ఆరోగ్యకరమైన గ్రామాలు – ఆరోగ్యకరమైన భారతదేశం” లక్ష్య సాధనలో కీలకంగా నిలుస్తాయన్నారు. నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఆరోగ్యకరమైన సేవలు కిందిస్థాయిలలో రోగులను గుర్తించి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఈ .ఎన్. వి . నరేష్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పల్లెనిద్ర తప్పనిసరి

* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
* సీఐలు,ఎస్సైలతో సమీక్ష సమావేశం

**శ్రీకాకుళం, అక్టోబర్6 (వార్త):** రానున్న స్థానిక ఎన్నికలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ముందస్తు నివారణ చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు సంబంధించి జిల్లా ఎస్పీ జిల్లాలో గల సీఐలు, ఎస్సైలతో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆస్తి నేరాల నియంత్రణ , ఎన్నికలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాల్లో అనవసర ఘర్షణలు, వర్గ విభేదాలు, చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రాత్రి బస చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలు, వ్యక్తులను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా నివారించడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.



# మిక్చర్ తినడానికి.. 10 లక్షలా?



* పాత అభ్యర్థి చైర్పర్సన్ అయితే ఇదే పరిస్థితి
* కౌన్సిలర్ అభ్యర్థుల గగ్గోలు.. పోటీకి విముఖత
* ఎలక్షన్ ఫండింగ్‌కి కూడా ఎదురుచూపులే
* నెలలో ఒక్కరోజు జరిగే సమావేశానికి పట్టుమని 10 నిమిషాలు కూడా కేటాయించని వైనం
* ప్రజా సమస్యలు గాలికి వదిలేయడంపై పాత కౌన్సిలర్ అభ్యర్థుల ఆవేదన

శ్రీకాకుళం, అక్టోబర్(వార్త): మిక్చర్ తినడానికి 10 లక్షల రూపాయలు ఖర్చు పెట్టాలా? మీరు చదువుతున్న వార్త నిజమే! ఆ మున్సిపాలిటీలో ఈ వింత పరిస్థితి గత పదేళ్లుగా ఎదురవుతుంది. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రత్యర్థులను ఢీకొని ఎన్నో రాజకీయ పరమపద సోపాన పటాలు ఎక్కి గెలుపు గుర్రంపై మున్సిపాలిటీలోకి అడుగు పెట్టి ప్రజా సమస్యలపై నిలదీద్దామని భావించే కౌన్సిలర్లకు ప్రతిసారి నిరాశే మిగులుతుంది. ఎలక్షన్లలో ఒక్కో అభ్యర్థి మెజార్టీ వార్డుల్లో పది లక్షల రూపాయల వరకు ఖర్చుపెట్టి కౌన్సిలర్లుగా ఎన్నికవుంటుంతారు. పార్టీ ఫండింగ్ తోడు తమ సొంత చేతి చమురు వదిలించుకొని అప్పులు చేసి మరి కౌన్సిల్లో అడుగుపెట్టేవారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు వార్డుల్లో చెప్పే సమస్యలు పరిష్కరించే దిశగా నెలకొక సమావేశం అయిన జరిగినప్పుడు ఆ సమావేశంలో తన సమస్యల ప్రస్తావిస్తాం అనుకున్న కౌన్సిలర్లకు ఏమాత్రం అవకాశం లేకుండా ఏకవాక్య తీర్మానంతో ఆమోదించమని ఒక్క పదంతో కూర్చున్న అరగంటలోనే లేచి వెళ్లిపోవడం కౌన్సిలర్లకు ఈ పదేళ్లపాటు తీవ్ర భంగపాటు తప్పలేదు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రతి 30 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలి. ఆ సమావేశానికి హాజరైతేనే 2500 రూపాయలు గౌరవ వేతనం దక్కుతుంది. ఎవరైనా సభ్యుడు వరుసగా మూడు సమావేశాలకు హాజరు కాకపోతే అతను సభ్యత్వం రద్దు అవుతుంది. ఈ ఒక్క కారణంగానే సమావేశాలకు హాజరవుతుంటారు. నెలలో ఒక్కరోజు కనీసం నాలుగు గంటలైనా ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించుకోవాలి అని గెలిచిన కౌన్సిలర్‌లలో ఉంటుంది. 30 అంశాలు ఉన్న ఎజెండాను సైతం 30 నిమిషాలు కూడా ఉండకుండా ఆమోదించామని లేచి వెళ్ళిపోతుడండంతో కౌన్సిలర్లు దిక్కుతోచని స్థితిలో ఉండేవారు. తమ వార్డులో లైట్లు వెలగవన్న, రోడ్లు బాగు లేవన్న, కాలువలు బాగా లేవన్న, వీధిలో పశువుల సంచారం, రోడ్లపై చెత్తాచెదారం, కుక్కల బెడద, కోతులు బెడదా గురించి ఇతర సమస్యల గురించి నెల అంతా వార్డుల్లో తిరిగి ప్రజల నుండి వచ్చిన సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తామని ఎంతో ఉత్సాహంగా ప్రిపేర్ అయ్యి వస్తుంటారు. రెండు బై మూడు వంతు సభ్యులు హాజరైతే కోరం సరిపోడంతో సమావేశం ఏర్పాటు చేస్తారు. సరిగ్గా 11 గంటలకు సమావేశం మొదలుకాగానే ఎజెండాలో అంశాలు చదువుతుండగా మున్సిపల్ సిబ్బంది సభ్యులకు గౌరవార్థం మిక్చర్, బిస్కెట్లు అతిథ్యంగా ఇస్తారు. అనంతరం వాటర్ బాటిల్ అందిస్తారు. ఇది తింటుండగా టీ తెచ్చేందుకు సిబ్బంది ప్రయత్నిస్తుంటారు.. కాస్త మిక్చర్ నోట్లో వేసుకునేటప్పటికే మొత్తం ఏజెండాను ఆమోదించామని తమకేదో అత్యవసర పని ఉందని ప్రతి సమావేశానికి ఏదో ఒక సాకు చెప్తూ జీరో అవర్, క్వశ్చన్ అవర్ అంటూ అన్ని గాలికి వదిలేసి అర్థంతరంగా వెళ్లిపోతుండడంతో సభ్యులకి ఏం చేయాలో పాలు పోదు. ఈ సమస్య గతంలో గెలిచి కౌన్సిల్‌కి వెళ్లిన కౌన్సిలర్ అభ్యర్థులకు బాగా అర్థమైంది. అందుకనే ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్గా పోటీ చేసేందుకు ఎవరు ధైర్యం చేయడం లేదు.. 10 వార్డుల్లో దీటైనా అభ్యర్థులు లేకపోగా ఉన్న పది వార్డుల్లో బలంగా ఉన్న అభ్యర్థులు సైతం, గతంలో గెలిచిన అభ్యర్థుల సైతం పోటీకి విముఖత చూపుతున్నారు. తాము గతంలో చేసిన అప్పే ఇంకా తీరలేదని మళ్లీ పోటీ చేయాలంటే నామినేషన్ వేసిన ఫీజు నుండి మొత్తం ఎలక్షన్ పండ్ ఖర్చు పెడతామంటేనే బరిలోకి దిగుతామని బహిరంగంగానే ఆ పార్టీ నేతలకు నిలదీస్తున్నారు. కౌన్సిల్ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలు అయిన తమ వార్డు పోలింగ్ బూత్ ఖర్చులు ఒకే వ్యక్తి చేతిలో తీసుకొని విడతల వారీగా వాయిదాల రూపంలో కొద్దిగా కొద్దిగా ఇస్తూ ఎన్నికలు పోలింగ్ ముగిసిన వరకు నానాతిప్పలు పెడుతూ సెల్ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుంటారని వాపోతున్నారు. మళ్లీ అదే వ్యక్తి తనకు మరోసారి టికెట్ అవకాశం కల్పిస్తే మొత్తం ఖర్చు తాను భరిస్తానని చెబుతుండడంపై పెదవి విరుస్తున్నారు. ఆ వ్యక్తి త్యాగం గత పదేళ్లుగా అంతా చూస్తున్నామని పార్టీ ఇచ్చిన ఫండ్ అభ్యర్థి ఇచ్చిన ఫండ్ సక్రమంగా పంచక వాటాల కుదరక పక్క పార్టీలో తన స్నేహితులకు గెలిపించేందుకు నిధులు మళ్ళించేవాడని వాపోతున్నారు. అటువంటిది ప్రస్తుతం ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో పార్టీ నుండి ఎటువంటి ఫండింగ్ రాకపోగా అభ్యర్థి మొత్తం వార్డులు ఖర్చు భరించాలి. ఈ అభ్యర్థి గతంలో ఉన్న బాకీలే తీర్చక పోగా ప్రస్తుతం మళ్ళీ ఎలక్షన్ ఫండింగ్ పంచుతాడని 'మాకు నమ్మకం లేదు దొర 'అంటున్నారు. నామినేషన్ ఎలాగో బ్రతిమాలాడి వేయించి పోలింగ్ ముందు రోజు వరకు పైసా, పైసా రూపాయి, రూపాయి ముష్టేసినట్లు పంచుతారని ఇటువంటి తరుణంలో తమ డబ్బుల కోసం కాలు చెప్పులు అరిగేలా తిరగాలా లేక వార్డులో ప్రచారం చేయాలా లేక ఎలాగూ కోటికి దిగామని మరో 10 లక్షలు అప్పు చేసి చేతి చమురు వదిలించుకోవాలా అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.. కేవలం మిక్సర్ తినడానికి అయితే 10 లక్షలు ఖర్చుపెట్టి కౌన్సిల్ కి వెళ్లడం వేస్ట్ అని గతంలో గెలిచిన కౌన్సిలర్లు భావిస్తున్నారు.ఏది ఏమైనాప్పటికీ ప్రస్తుత కీలక తరుణంలో గెలుపు కోసం ఒక తంటా అయితే టికెట్ కోసం ఒక తంటా కౌన్సిల్ అభ్యర్థులను వెతుక్కోవడం ఇంకో తంటా పార్టీకి ఫండింగ్ చేయడం మరో తంటా 'నాకు నమ్మకం లేదు దొర' అని విసిగిపోతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జ్ఞానేశ్వర్ కుమార్‌ను తక్షణమే తొలగించాలి

**- ఎన్నికల కమిషన్ చర్యలపై ఇండియా కూటమి నాయకుల ఆగ్రహం**

**- 8న శ్రీకాకుళంలో 'సేవ్ డెమోక్రసీ' భారీ ర్యాలీ**

**- చంద్రబాబు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కిల్లి కృపారాణి డిమాండ్**



**శ్రీకాకుళం, అక్టోబరు 6 (వార్త):** ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి నాయకులు ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, 'ఎస్ఐఆర్' ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో మంగళవారం ఇండియా కూటమి నాయకుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అక్రమాలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు జిల్లాలో ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 8న 'ఓటు బచావో.. దేశ్ బచావో' నినాదంతో శ్రీకాకుళం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈవీఎంల ట్యాంపరింగ్, ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలు, ఫామ్-6కు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోరాటం చేస్తున్నారని కృపారాణి తెలిపారు. ఈ అంశాలపై దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు స్పందించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన చర్చను మరింత విస్తృతం చేసిందన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను కూడా కృపారాణి ప్రస్తావించారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిందంటూ చేసిన వ్యాఖ్యలను పునఃపరిశీలించి, వాటిని వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని కోరారు. సీపీఎం నాయకుడు మోహన్‌రావు మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ కుమార్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మరో సీపీఎం నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో తొలగించినట్లు చెబుతున్న ఓట్ల అంశాన్ని పునఃపరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం ఇండియా కూటమి నాయకులు ఎన్నికల కమిషన్ నియామకం, ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ కుమార్‌పై ఏకపక్షంగా తీర్మానం చేసి, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఇండియా కూటమి నాయకులు కిల్లి రామ్మోహన్‌రావు, రెల్ల సురేష్, అంబటి కృష్ణ, తాంద్ర ప్రకాష్, ఎస్.కృష్ణవేణి, డి.గోవింద మల్లిబాబు, కోత మధుసూదన్‌రావు, కొత్తకోట సింహాద్రినాయుడు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, విద్యారతు రమణ, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, కొత్తకోట లక్ష్మీ, కురాకుల వెంకటరావు, చాన్ బాషా, జి.రామారావు, గొల్లపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సొండిపూడిలో సేవా సంకల్ప్ అభియాన్



**మందస, అక్టోబరు 6(వార్త):** మందస మండలంలోని సొండిపూడిలో భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా సొండిపూడి హైస్కూల్ లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఎల్ఏ-1 ఎర్రగుంట్ల కృష్ణమోహన్, పూర్వ జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ రట్టి లక్ష్మణ్ కుమార్, పూర్వ ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జ్ రౌతు చిరంజీవి, బీజేపీ మందస మండల ప్రెసిడెంట్ తెలుకుల సురేష్, పూర్వ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొర్రాయి బాలకృష్ణ, ఓబీసీ మోర్చా మందస మండల ప్రెసిడెంట్ బతకల చంద్రయ్య, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత



**మందస, అక్టోబరు 6(వార్త):** మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత కావాలని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఆర్మీ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జరిగింది. కదంబ, చెర్రీ, బాదం తదితర నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు, యువత, ప్రజలు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని కోరారు. మొక్కలు మనకు స్వచ్ఛమైన గాలి, నీరు వర్షాలు మరియు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయన్నారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ ఒక్కరూ ఒక మొక్క అనే సంకల్పంతో ముందుకు సాగితే, పచ్చని భవిష్యత్తును నిర్మించుకోవచ్చునన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు, గ్రీన్ ఆర్మీ సభ్యుడు గవ్వ భీమారావు, ఉపాధ్యాయులు జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.చిన్నకృష్ణ, బి.రమేష్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి మన లక్ష్యం



**సోంపేట, అక్టోబరు 6(వార్త):** గ్రామాల అభివృద్ధి మన లక్ష్యమని మాజీ ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. మామిడిపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ దాసు, డాక్టర్ ప్రధాన్ ఆర్థిక సహకారంతో నిర్మించిన వంటశాలను డాక్టర్ దాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యారంగం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. గ్రామంలో ఉన్నత విద్యావంతులు అధికమైనప్పుడు ఆ గ్రామం ఎంతగానో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్యా పంతులుగా తీర్చిదిద్దేందుకు శాయ శక్తులా కృషి చేయాలని అన్నారు. మామిడిపల్లి హై స్కూల్ అభివృద్ధిలో తన భాగస్వామ్యం కూడా ఉన్నందున ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ దున్న మాధవరావు, మాజీ సర్పంచులు పిన్నింటి ఈశ్వరరావు, శంకర్రావు, పాతిన నాని, గోరకల లింగరాజు, కృష్ణమూర్తి, గూడ తాతారావు, అప్పలస్వామి, ఎస్ఎంసి చైర్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత భూములకు శాశ్వత భరోసా

**మందస, అక్టోబరు 6(వార్త):** అన్నదాత భూములకు శాశ్వత భరోసాను కూటమి ప్రభుత్వం కల్పించిందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. కుంటికోట పంచాయతీలో గల కొత్తకమలాపురం గ్రామంలో రాజముద్ర కూడిన పాసు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ రైతుల సంక్షేమం దిశగా మరో అడుగు ముందుకు పడిందన్నారు. కొత్తకమలాపురం రెవెన్యూ గ్రామ రైతులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన రాజ ముద్రతో కూడిన కొత్త భూ హక్కు పాసు పుస్తకాలను అధికారికంగా అందజేయడం జరిగిందన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వాలు గుర్తించి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. కొత్త పాసు పుస్తకాల ప్రత్యేకతలతో బహుళ ప్రయోజనాలున్నాయని, భూ యజమానులకు ప్రభుత్వం అందించే ఈ నూతన రాజముద్ర పాసు పుస్తకాలు అనేక రకాల ప్రయోజనాలను చేకూరుస్తాయన్నారు. బ్యాంకు రుణాలు సులభతరం అవుతుందని, రైతులు వ్యవసాయ అవసరాల కోసం బ్యాంకు రుణాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ ఇందిర, వీఆర్వో అర్జున్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఎన్నో రోజులుగా తమ పాసు పుస్తకాల కోసం ఎదురు చూస్తున్న కొత్తకమలాపురం గ్రామానికి చెందిన రైతులకు ఈ పుస్తకాలు అందడంతో వారిముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. మండల అధ్యక్షులడు బావన దుర్యోధన చేతుల మీదుగా పాసు పుస్తకాలు అందుకోవడం పట్ల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఇందిర, అర్జున్ లు గ్రామంలో ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడంపై స్థానికులు అభినందించారు.



# సిరిపురంలో వరుణయాగం



**మందస, అక్టోబరు 6(వార్త):** మందస మండలంలోని సిరిపురం గ్రామంలోని శ్రీశ్రీశ్రీరఘునాథ స్వామి దేవస్థానంలో నియోజకవర్గం తరఫున నిర్వహించిన వరుణయాగంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండి, రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న వరుణ యాగాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయానికి అనుకూలంగా వర్షాలు కురవాలని, సాగునీటి కొరత తొలగి రైతులకు ఉపశమనం కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలు నెరవేరాలని, వారు శ్రమించి సాగు చేస్తున్న పంటలు సక్రమంగా చేతికి అందాలని ఈ యాగం ద్వారా ప్రార్థించారు. చెరువులు, జలాశయాలు నిండి సాగుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావాలని, గ్రామాల్లో వ్యవసాయ కార్యకలాపాలు సాఫీగా కొనసాగాలని కోరుకున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడాలని ఎమ్మెల్యే గౌతు శిరీష గారు ప్రత్యేక పూజలు చేశారు. పలాస నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని రఘునాథ స్వామిని ప్రార్థించారు. కార్యక్రమం లో భాగంగా మందస మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మందస మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# హరిపురంలో అభివృద్ధి పనుల పరిశీలన



**మందస, అక్టోబరు 6(వార్త):** పలాస నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతం అవుతోంది. ప్రజల సంక్షేమం, రవాణా భద్రత, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగానే పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష మందస మండలంలో విస్తృతంగా పర్యటించారు. మందస మండలంలోని రద్దీ ప్రాంతమైన హరిపురం గ్రామంలో జరుగుతున్న సెంటర్ డివైడర్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హరిపురం కూడలిలో తరచూ జరిగే ట్రాఫిక్ సమస్యలకు, ప్రమాదాలకు శాశ్వత పరిష్కారంగా ఈ సెంటర్ డివైడర్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఈ సందర్భంగా ఆమె సూచించారు. పరిశీలన అనంతరం హరిపురం ఇండోర్ స్టేడియం ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష త్వరలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు శంకుస్థాపన చేయనున్న నూతన ప్రాజెక్ట్ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి స్థానిక అధికారులకు, నాయకులకు పలు కీలక సూచనలు జేశారు. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హరిపురం ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు స్థానికులు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్‌వాడీ లక్ష్య సాధనకు కృషి చేయాలి

**మందస, అక్టోబరు 6(వార్త):** అంగన్ వాడీ లక్ష్య సాధనకు అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు సీడీపీఓ పి.అరుణ అన్నారు. మందస మండలంలోని అంగన్ వాడీ కేంద్రాలను సీడీపీఓ అరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా పోషణ మాహ్, సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా సిరిపురం సెక్టార్ లోని తాళ్లగురంటి పంచాయతీలో గల చిన్నకోస్టా అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన అంగన్ వాడీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ అరుణ మాట్లాడుతూ కేంద్రాలను వచ్చే చిన్నారులను సొంతబిడ్డల్లా చూసుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. పోషణ మాహ్, సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా షెడ్యూల్ చేయబడిన వివిధ అంగన్వాడీ కేంద్రాలలో అంగన్ వాడీ ఉత్సవాల కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. లబ్ధిదారులకు అంగన్ వాడీ సేవలు, పీఎంఎంవీవై, నవచేతన స్క్రీనింగ్, పోషకాహారం, బాల్య వివాహాలు, మహిళభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఇతర విభాగాలపై అవగాహన కల్పించారు. ఐసీపీఎస్, ఓఎస్సీ, హెల్ప్ లైన్ నంబర్లు, పోషణ్ హెల్ప నంబర్ 1515 తదితర అంశాలను వివరించారు. చిన్నారుల గ్రోత్ రేండం వెరిఫికేషన్ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు అన్నప్రాసనలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పి.జయలక్ష్మి, సెక్టార్ అంగన్ వాడీ కార్యకర్తలు, స్కూల్ హెచ్ఎం కృష్ణమూర్తి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## 10న మందసలో కామ్రేడ్ సత్యం మాస్టారు వర్ధంతి



**మందస, అక్టోబరు 6(వార్త):** కామ్రేడ్ సత్యం మాస్టారు మూడవ వర్ధంతి కార్యక్రమం ఈనెల 10న జరుగుతుందని, ఈ సందర్భంగా జరుగు సదస్సును రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.కేశవరావు పిలుపునిచ్చారు. మందస సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సత్యం మాస్టర్ జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. సత్యంమాస్టర్ తూర్పుగోదావరి ప్రాంతం నుంచి మందస ఉపాధ్యాయ వృత్తి రీత్యా వచ్చి మందస ప్రాంతంలో పేద ప్రజలు, కార్మికులు, గిరిజనులకై తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు. సమాజంలో అణగారిన, పేద వర్గాల విముక్తి కోసమే ఆయన తన జీవితాంతం శ్రమించారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సిపిఎం పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి అజరామరమైనదన్నారు. అత్యంత సామాన్యమైన జీవితాన్ని గడిపిన నిరాడంబర నాయకుడని కొనియాడారు. నేటి రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్న తరుణంలో సత్యంమాస్టర్ లాంటి నాయకుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సత్యం మాస్టారుకు నివాళులు అర్పించి, కార్మిక వర్గ పోరాటాల భవిష్యత్ కర్తవ్యాలు తీసుకునేందుకు కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మట్ట ధర్మారావు, పొందర దేవేంద్ర, ఎ.కృష్ణారావు, ఆర్.దిలీప్ కుమార్, ఎస్.వల్లభ, కె. కృష్ణారావు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి నవరాత్రులకు ముహూర్తపు రాట



**జి.సిగడాం, అక్టోబరు 6(వార్త):** శ్రీ దుర్గా దేవి నవరాత్రులు మహోత్సవ సందర్భంగా ఎస్ పీ ఆర్ పురం గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ముహూర్తపు రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంకురార్పణ చేశారు మ్మవారి ముహూర్తపు రాట గ్రామస్తులందరూ కలిసి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 11వ నుండి 20 వరకు అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు, ఉత్సవ కమిటీ ఆంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు.ప్రతి ఏటా జరిగే విధంగానే అందరూ ఈ కూడా ఏడాది సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ కంది రమాదేవి, గ్రామ పెద్దలు పెద్దలు, మహిళలు, చిన్నారులు, యూత్ సభ్యులు, కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం

**పాతపట్నం, అక్టోబరు 6(వార్త):** కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని పాతపట్నం జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ ఎం రోషిణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంఘం పాతపట్నం ఆధ్వర్యంలో "మధ్యవర్తిత్వం - దేశం కోసం" అనే నినాదంతో 30 రోజుల పాటు (నుండి 31 వరకు) ప్రత్యేక అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రహారాజపాలెం గ్రామంలో న్యాయ అవగాహన ర్యాలీ నిర్వహించి, స్థానిక ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఉభయ పక్షాల ఒప్పందంతో మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవ్వడమే కాకుండా సంబంధాలు దెబ్బతినకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యు దాలయ్య, ఎం రమణ, ఎల్ యుగంధర్, పి అప్పలనాయుడు, కోర్టు సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలి




**పలాస, అక్టోబరు 6 (వార్త):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేసి, ఇప్పటివరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలాస రైల్వే సంస్థలో పౌర హక్కుల సంఘం శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమావేశం నిర్వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి దానేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమానికి ప్రజాసంఘాలు సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు తొలగించబడినట్లు పేర్కొంటున్న 13.30 కోట్ల ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే పరిస్థితి ఏర్పడిందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దిల రామారావు విమర్శించినట్లు తెలిపారు. ఇది ప్రజల ఓటు హక్కుపై ప్రభావం చూపే అంశమని ఆయన చెప్పారు. విద్యార్థి, యువజన సంఘాలు కూడా ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె. వినోద్‌కుమార్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల వరకు యువత చురుగ్గా పాల్గొంటోందని ఆయన వివరించారు. ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు సభ్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయాలను పలుమార్లు వ్యతిరేకించినట్లు పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా పారదర్శకత, సమిష్టి నిర్ణయ ప్రక్రియ ఉండాలని ఆయన కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను అమలు చేస్తోందని పీడీఎం జిల్లా అధ్యక్షుడు సాలిన వీరస్వామి ఆరోపించారు. దేశ ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడంతో పాటు పౌరుల రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని అమరుల బంధుమిత్రుల సంఘం ప్రతినిధి తామాడ త్రిలోచన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) జనశక్తి నాయకుడు కోనేరు రమేష్, సీపీఎం జిల్లా నాయకుడు ఎం. గణపతి, డీటీఎఫ్ నాయకుడు కోత ధర్మారావు, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, సామాజిక రచయిత మామిడి కోదండరావు, కార్గో విమానాశ్రయ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కొమర వాసు, జర్నలిస్టు రచయిత విజయవర్మ, కార్మిక నాయకుడు పుచ్చ దుర్యోధన, మహిళా నాయకురాలు నాగమణి, పౌర హక్కుల సంఘం జిల్లా బాధ్యులు సోమనాదం, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డ్రాఫ్ట్ పాస్‌బుక్ చూపించాకే ఈ-కేవైసీ!



**పలాస, అక్టోబరు 6 (వార్త):** భూముల పునఃసర్వే, పట్టాదారు పాస్‌బుక్‌ల జారీ ప్రక్రియలో రైతుల హక్కులకు భంగం కలగకుండా పూర్తి పారదర్శకత పాటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతుల భూములకు సంబంధించిన వివరాలను ముందుగా వారికి చూపించి, తప్పొప్పులను సరిచేసిన అనంతరం మాత్రమే ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. డ్రాఫ్ట్ పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వకుండానే ఈ-కేవైసీ పూర్తి చేయించడం వల్ల భవిష్యత్తులో భూ హక్కుల వివాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షైనీ దేశయ్య, కే.ధనరాజు, రైతులు కుత్తుం ధర్మారావు, ఎస్.రామారావు, పుచ్చా వీరస్వామి, కే.లింగమూర్తి, తెప్పల రాజు, షణ్ముఖరావు, బత్తిని దుర్యోధన, ఎస్.కోదండరావు, బి.వీరస్వామి, పి.ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి



**పలాస, అక్టోబరు 6 (వార్త):** ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆశా కార్యకర్తల వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన అవసరమైన సంఖ్యలో ఆశా కార్యకర్తలను నియమించి, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న వారికి అర్హతలను పరిగణనలోకి తీసుకుని ఆశా కార్యకర్తలుగా అవకాశం కల్పించాలని, అర్హత ఉన్న ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆశా కార్యకర్తలకు అన్ని రకాల సెలవుల సౌకర్యాన్ని అమలు చేయడంతో పాటు, భవిష్య నిధి, ఉద్యోగుల బీమా, పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, గత ఏడేళ్లుగా వేతనాలు పెరగకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. అంతకుముందు నిర్వహించాల్సిన ఆశా దినోత్సవాన్ని వాయిదా వేయాలని కోరుతూ వైద్యాధికారులకు కూడా ఆశా కార్యకర్తలు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.లావణ్య, వై.హేమలత, రేవతి, కోటేశ్వరి, లక్ష్మి, ద్రౌపది, కుమారి, ఎస్.దివ్య, జి.కృష్ణవేణి, పి.మీన, పి.శ్రీదేవి తదితరులతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెక్కలిపట్నంలో ఘనంగా 9వ పోషణ్ మాహ్



**పలాస, అక్టోబరు 6 (వార్త):** పౌష్టికాహార ప్రాధాన్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా టెక్కలిపట్నం గ్రామంలో 9వ పోషణ్ మాహ్ క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించినట్లు సీడీపీవో కే. పార్వతి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో నిర్వహించిన మంగళవారం ఈ కార్యక్రమంలో పోషకాహారం, తల్లీబిడ్డల ఆరోగ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు ఆమె వివరించారు. ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సంబంధిత సమాచారం కోసం వచ్చే ఐవీఆర్ కాల్స్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలతో పాటు ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు వయసుకు తగిన పౌష్టికాహారం అందించాల్సిన అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. శరీర నిర్మాణానికి, రోగనిరోధక శక్తి పెంపునకు అవసరమైన ప్రోటీన్ల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ, స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, ఇతర పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఆహార పదార్థాల్లోని పోషక విలువలు తగ్గకుండా వంట చేసే సరైన పద్ధతులను కూడా వివరించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అంగన్‌వాడీ మానిటరింగ్ కమిటీల బాధ్యతలు కీలకమని, కేంద్రాల పనితీరును పర్యవేక్షించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను సమర్థంగా అందేలా చూడాల్సిన అవసరం ఉందని సూచించినట్లు సీడీపీవో కే. పార్వతి తెలిపారు. పోషణ్ మాహ్ లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ యు. లత, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు బి. నిర్మల, అరుణ, రేగులపాడు అంగన్‌వాడీ టీచర్ దమయంతి, వీరభద్రపురం, సవరపేట, అమలకుడియా అంగన్‌వాడీ కార్యకర్తలు, మోదుగుపుటి హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యకు స్వచ్ఛమైన నదీ జలాలతో పరిష్కారం

- బోరు నీటిని తాగొద్దు.
-నదీ జలాలనే వినియోగించాలి
-నీటి వృథాను అరికట్టాలి
-ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, అక్టోబరు 6 (వార్త):** ఉద్దానం ప్రాంతాన్ని తీవ్రంగా వేధిస్తున్న కిడ్నీ సమస్యకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ద్వారా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. జల జీవన్ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వంశధార నది నుంచి పైపులైన్ల ద్వారా స్వచ్ఛమైన నీటిని ఉద్దానం ప్రాంత ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం అత్యంత ముఖ్యమన్నారు. తాగునీటి నాణ్యతపై వైద్య నిపుణులు సూచిస్తున్న అంశాలను ప్రజలు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో జల జీవన్ కార్యక్రమం ముందుకు సాగుతోందని, ఇందుకు పలాస, ఉద్దానం ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కుళాయిల ద్వారా నదీ జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొంతమంది ఇంకా బోరు నీటినే తాగుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాగడానికి, వంట చేయడానికి కుళాయిల ద్వారా వచ్చే నదీ జలాలనే వినియోగించాలని సూచించారు. బోరు నీటిని ఇతర గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని కోరారు. కుళాయిలు ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే అవి పాడై నీరు వృథాగా పోతున్న సందర్భాలు ఉన్నాయని గౌతు శిరీష తెలిపారు. కుళాయిలు దెబ్బతిన్న వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని, నీరు వృథాగా పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత తలెత్తకుండా ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యను నియంత్రించేందుకు స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇంటింటికీ అందిస్తున్న నదీ జలాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

## మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం సులభతరం



**పలాస, అక్టోబరు 6 (వార్త):** న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సఖ్యతతో పరిష్కరించుకోవచ్చని శిక్షణ పొందిన న్యాయవాద మధ్యవర్తి కొమర దేవరాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, పలాస సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ సూచనలతో మంగళవారం మొగిలిపాడు గ్రామంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అనేక కేసులను పరస్పర అంగీకారంతో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. దీనివల్ల న్యాయస్థానాల చుట్టూ తిరిగే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సఖ్యత కొనసాగుతుందని వివరించారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో ఇరుపక్షాల అభిప్రాయాలను తెలుసుకుని, పరస్పర చర్చల ద్వారా సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎటువంటి రుసుము లేకుండా సఖ్యతపూర్వకంగా వివాదాలను పరిష్కరించుకునే వీలుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద దున్న సత్యారావుతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయాన్ని శాశ్వత పరిష్కారం చూపండి



**పాతపట్నం, అక్టోబరు 6 (వార్త):** పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత కొద్ది నెలలుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో హఠాత్తుగా విద్యుత్ నిలిచిపోతుండటం, ఆఫ్ కరెంట్ రావడంతో పసిపిల్లలు, వృద్ధులు విపరీతమైన అవస్థలు పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. కాలనీ సమీపంలో పలు కార్యాలయాలు, వసతి గృహానికి అధిక విద్యుత్ లోడ్ కారణంగానే ఈ సమస్య తలెత్తుతోందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ, కేవలం తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని, దాంతో మళ్లీ సమస్య మొదటికే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం మరియు లోడ్ పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, విద్యుత్ అంతరాయానికి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతూ వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు మంగళవారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో దుక్క శ్రీకాంత్ రెడ్డి, శివప్రసాద్ మిశ్రో, చిరంజీవి, ఉమాశంకర్, గాంధీ, బాబూరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## దివిస్ లాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు పలాసలో 8న ఉద్యోగ మేళా

-అర్హత కలిగిన యువత సద్వినియోగం చేసుకోవాలి
-ప్రిన్సిపాల్ పైల జవహర్

Divis దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్

కాకినాడ సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుడ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2020 - 2026 PASSED OUT

| Job Title | Qualification | Age | Salary (P.M |
| --- | --- | --- | --- |
| Helper / Technician | SSC / ITI Fitter, Ele. & Mech. | 19-26 yrs | Rs. 15,000 |

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగల ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసి ఉంటుంది.

| | |
| --- | --- |
| 05-10-2026 | GOVT. ITI COLLEGE Srikakulam Road, RAJAM |
| 06-10-2026 | GOVT. ITI COLLEGE V.T. Agraharam, VIZIANAGARAM |

**పలాస, అక్టోబరు 6 (వార్త):** కాకినాడ సమీపంలోని ప్రముఖ బల్క్ డ్రగ్ పరిశ్రమ అయిన దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్‌లో ఉత్పత్తి విభాగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 8న పలాసలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డా. వి. కనితి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంకినమ్మ గుడి సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఫిట్టర్, విద్యుత్ కార్మికుడు, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. 2020 నుంచి 2026 మధ్య విద్యార్హతలు పూర్తి చేసిన వారు అర్హులని, అభ్యర్థుల వయస్సు 19 నుంచి 26 సంవత్సరాల మధ్య ఉండాలని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల వేతనం అందజేస్తారని, భవిష్యనిధి, ఉద్యోగుల ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. అవివాహిత పురుష అభ్యర్థులకు ఉచిత వసతి, ఉచిత దుస్తులు అందించడంతో పాటు భోజన ఖర్చుల్లో రాయితీ ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారు పరిశ్రమలో మార్పిడి విధానంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ జీవిత చరిత్రతో పాటు విద్యార్హతలకు సంబంధించిన అసలు ధ్రువపత్రాలు, వాటి నకళ్లను తీసుకుని హాజరుకావాలని ప్రిన్సిపాల్ పైల జవహర్ సూచించారు. ఉద్యోగ మేళా ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

## కొరికాన రవి ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు

**పలాస, అక్టోబరు 6 (వార్త):** జిల్లా జనసేన నాయకుడు, పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొరికాన రవికి ఇటీవల శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజా సేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ పలాస నియోజకవర్గ మున్సిపాలిటీ జనసేన నాయకుడు శంకు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకు శ్రీకాంత్ మాట్లాడుతూ కొరికాన రవి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనే రవి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ఆకాంక్షతో ఉన్నారని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొరికాన రవి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజలకు సేవలందించేలా భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జనసేన నాయకులు పిట్ట ఉదయ్, లైశెట్టి గిరీష్, దీనబంధు, బంగారి కేదార్, శివ, దేవా, నాగరాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



## రైతన్నలు సుభిక్షంగా ఉండాలి

**పాతపట్నం, అక్టోబరు 6 (వార్త):** రాష్ట్రం పచ్చని పంటలతో సస్యశ్యామలంగా, రైతన్నలు సుభిక్షంగా ఉండడంతో పాటు ప్రజలకు సాగునీరు, తాగునీటి కొరత లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరుణ యాగం, వరుణ జపం కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వరుణ యాగం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని, రైతన్నలు ఆనందంగా ఉండాలని, ప్రజలకు సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అర్చకులు , ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## 8న నీలమణి అమ్మవారి హుండీ లెక్కింపు

**పాతపట్నం, అక్టోబరు 6 (వార్త):** పాతపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలో గల ధర్మహుండీలను ఈనెల 8వ తేదీ (గురువారం)న లెక్కించనున్నట్లు ఆలయ నిర్వహణాధికారి వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు మరియు సేవా సమితి సభ్యుల సమక్షంలో హుండీలను తెరిచి కానుకలను లెక్కించనున్నట్లు, ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న భక్తులు తప్పనిసరిగా సాంప్రదాయ డ్రెస్ కోడ్ పాటించి హాజరు కావాలని ఆలయ అధికారులు కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జాతీయ మహిళా కమిషన్ సదస్సుకు సారవకోట ఐసీడీఎస్ పీవో

- న్యూఢిల్లీలో జరిగే జాతీయ సదస్సుకు సిహెచ్ వంశీ ప్రియ ఎంపిక
- మహిళల రక్షణ, న్యాయ సహాయంపై సదస్సులో చర్చ
- అభినందనలు తెలిపిన పలువురు ఐసీడీఎస్ పీవోలు

**సారవకోట, అక్టోబరు 6 (వార్త):** న్యూఢిల్లీలో ఈనెల 7న నిర్వహించనున్న మహిళా కమిషన్ జాతీయ సదస్సుకు సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి (పీవో) సిహెచ్ వంశీ ప్రియ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆమె మంగళవారం తెలిపారు. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై జాతీయ స్థాయిలో జరిగే ఈ సదస్సులో చర్చించనున్నట్లు వంశీ ప్రియ పేర్కొన్నారు. ముఖ్యంగా గృహహింసకు గురవుతున్న మహిళలను రక్షించడం, బాధితులకు అవసరమైన న్యాయ సహాయం అందించడం, వారికి రక్షణ కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చ జరుగుతుందని తెలిపారు. మహిళలపై హింసను అరికట్టడం, బాధితులకు సకాలంలో సహాయం అందించడం, వారికి అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై సదస్సులో అభిప్రాయాలు, సూచనలు పంచుకునే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. జాతీయ స్థాయి సదస్సుకు ఎంపిక కావడం పట్ల సారవకోటకు చెందిన పలువురు ఐసీడీఎస్ పీవోలు వంశీ ప్రియను అభినందించారు. మహిళల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై జరిగే ఈ సదస్సు ద్వారా పలు ముఖ్యమైన విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.



## ఘనంగా జాతీయ పౌష్టికాహార దినోత్సవం



**పాతపట్నం, అక్టోబరు 6 (వార్త):** పాతపట్నం మండలం తెంబూరు గ్రామంలోని అంగన్వాడి-1 కేంద్రంలో మంగళవారం 'జాతీయ పౌష్టికాహార దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ గోవిందమ్మ బాలింతలు, గర్భిణులు మరియు పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను సమగ్రంగా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, పిల్లల ఆరోగ్యం కోసం అనేక సంక్షేమ సేవలను అందిస్తున్నాయని, అర్హులైన వారందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీ పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కస్తూరి, ఏఎన్ఎం ఇందిర, మహిళా పోలీస్ అప్పలమ్మ, ఆశా వర్కర్లు మరియు అంగన్వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి



**పాతపట్నం, అక్టోబరు 6 (వార్త):** ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటియు అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావుకు సంఘ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పనస రమేష్, ఎస్ గౌరమ్మ, పల్ల కృష్ణలతో పాటు యూనియన్ నాయకులు శిల్లా భవాని, స్వర్ణలతా పట్నాయక్, పి జయలక్ష్మి, పావని, జ్యోతి మాట్లాడారు. గత 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి ప్రజారోగ్య రక్షణలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించినప్పటికీ వారి సేవలకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం లేక, ప్రోత్సాహకాల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేసి, వారిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, బి లీలావతి, పి అమ్మోజీ, జున్ను, యశోధ, సత్యవతి, పద్మావతి, భాను, పుష్ప, జ్యోతి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ మోడల్ పాఠశాలలో ఎంఈవో ఆకస్మిక తనిఖీ



**జలుమూరు, అక్టోబరు 6 (వార్త):** జలుమూరులోని ఆదర్శ మోడల్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శతశాతం ఉండటంపై ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, పాఠశాలకు వచ్చేలా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను, హెచ్ఎం మాధవరావును ఆయన అభినందించారు. ఇదే విధంగా విద్యార్థుల హాజరును కొనసాగిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎంఈవో పరిశీలించారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, అందుతున్న విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనంపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత విషయంలో నిర్లక్ష్యం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల నిర్వహణలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వార్డు కౌన్సిలర్‌గా టిక్కెట్ ఇవ్వండి.

ఇచ్ఛాపురం అక్టోబరు 6 (వార్త ):మున్సిపాలిటీ లో కొత్తగా ఏర్పాటు అవుతున్న 8 వ వార్డు తెలుగుదేశం పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా తెలుగుదేశం యువ నాయకులు దుక్కా జోగారావు కి కేటాయించాలని వార్డు ప్రజలు కోరారు.తన మద్దతు దారులు తో ఎమ్మెల్యే అశోక్ బాబు కు కలసి విజ్ఞప్తి చేశారు. ఎంతో కాలంగా టీడీపీ సేవలు అందించిన తనకి ఈసారి కొత్తగా ఏర్పాటు చేసిన 8 వార్డు నుండీ టీడీపీ టిక్కెట్ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో దుక్క డిల్లీ, సీరపు హేమయ్య, ఆశి ఉమాపతి,మంచాల చిన్నయ్య, మంచాల రాము,ఉప్పాడ సత్తయ్య, గంగులు తది తరలు పాల్గొన్నారు.



## నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది విధుల బహిష్కరణ



**నరసన్నపేట, అక్టోబరు 6 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టారు. తమకు బేసిక్ వేతనాన్ని నిర్ణయించడంతో పాటు ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పత్రి వద్ద సిబ్బంది మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. అయితే నోటీసుపై ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నేటి నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి తగిన వేతన భద్రత కల్పించాలని, తమ ఉద్యోగాలను శాశ్వతీకరించే చర్యలు చేపట్టాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టిన పోరాటాన్ని కొనసాగిస్తామని సిబ్బంది స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని వారు కోరారు.

## శిథిల విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు

**నరసన్నపేట, అక్టోబరు 6 (వార్త):**నరసన్నపేట పట్టణంలోని మెయిన్ రోడ్ నుంచి ఏరియా ఆసుపత్రి వరకు ఉన్న విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత స్తంభాలు బలహీనంగా మారి ప్రమాదకర పరిస్థితి నెలకొనడంతో వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు, మాజీ ఉప సర్పంచ్ కృష్ణబాబు విద్యుత్ శాఖ డీఈలకు వినతిపత్రం సమర్పించారు. శిథిలమైన స్తంభాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకముందే వాటిని తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. వారి వినతికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మంగళవారం నుంచి పాత స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. దీంతో మెయిన్ రోడ్ నుంచి ఏరియా ఆసుపత్రి మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదభయం తగ్గనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## డ్రోన్‌తో పొలాలకు జిల్లేడు ద్రావణం పిచికారీ



**నరసన్నపేట, అక్టోబరు 6 (వార్త):**నరసన్నపేట మండలం యారబాడులో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా వరి పంట పొలాలకు డ్రోన్ సహాయంతో జిల్లేడు ద్రావణాన్ని పిచికారీ చేశారు. మంగళవారం స్థానిక రైతు పూతి నరసయ్యకు చెందిన పది ఎకరాల వరి పొలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ టి.రమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా జిల్లేడు ద్రావణాన్ని పంటలకు వినియోగించడం వల్ల రైతులకు పలు ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. జిల్లేడు ద్రావణం వినియోగంతో రసాయన ఎరువులపై ఆధారపడే భారం కొంతవరకు తగ్గడంతో పాటు పంటకు అవసరమైన పొటాషియం అందుతుందని వివరించారు. పెద్ద విస్తీర్ణంలో ఉన్న పంట పొలాలకు సంప్రదాయ పద్ధతులతో పిచికారీ చేయడం కంటే డ్రోన్ సాంకేతికతను వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ద్రావణాన్ని సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడం ద్వారా రైతులకు శ్రమ, సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పరిశీలించిన రైతులు డ్రోన్ ద్వారా ద్రావణం పిచికారీ చేసే విధానాన్ని ఆసక్తిగా గమనించారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగిస్తున్న పద్ధతులు, వాటి ప్రయోజనాలపై మాస్టర్ ట్రైనర్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## గిరిజన యువకుడి అనుమానాస్పద మృతి!

**సోంపేట, అక్టోబరు 6 (వార్త):** సోంపేట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు సవర వెంకట్రావు (25) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఇతని మృతదేహం శారదాపురం సమీపంలో మంగళవారం సాయంత్రం కనుగొన్నారు.

ఇతనికి సంబంధించిన ద్విచక్ర వాహనం కంచిలి మండలం జలంత్రకోట సమీపంలో తుట్టాసాయి గ్రామం వద్ద లభించింది. ఈ ఘటన విద్యుత్ షాక్ కారణంగా జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నప్పటికీ దీని వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జలాత్రకోట గ్రామంలో అమ్మవారి యాత్ర జరిగిన రోజు మృతుడు వెంకట్రావు యాత్రలో కనిపించినట్లు పలువురు పేర్కొంటున్నారు. పుట్టా సాయి గ్రామం వైపు గిరిజన యువతి తో వెంకట్రావుకు ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. యాత్ర చూసుకొని నేరుగా తొట్టా సాయి వెళ్ళినట్లు పలువురు భావిస్తున్నారు. అక్కడినుంచి శారదాపురం వైపు బైక్ ఇక్కడ విడిచి పెట్టి ఎలా వెళ్లాడు? ఎవరితో కలిసి వెళ్ళాడు? అనే విషయాలు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

## జేపీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఇచ్ఛాపురం, అక్టోబరు 6 (వార్త):** ఇచ్ఛాపురంలోని ఐ పి ఎం న్యూస్ కార్యాలయంలో మంగళవారం గౌరవ అధ్యక్షులు కోట రామారావు అధ్వర్యం లో జే పి సి సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం లో జే పి సి అధ్యక్షులు గా టి. రాజేష్ నుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వైస్ ప్రెసిడెంట్ గా డి. శ్రీనివాస్ పట్నాయక్, సెక్రెటరీ గా బొండడా శంకర్, జాయింట్ సెక్రెటరీ గా డి. రాజేష్, ట్రెజరరీ గా బి. రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా అధ్యక్షులు టి. రాజేష్ మాట్లాడుతూ సంఘ బలోపేతనికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో సభ్యులు తిప్పన ధనుంజయ రావు, కాళ్ళ శ్రీనివాస్, టి. జగన్, ఆర్. జయకృష్ణ, శంకర్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ అభ్యర్థిత్వానికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో మెండ దాసు నాయుడు భేటీ
- తల్లి మెండ ఆదిలక్ష్మికి ఎంపీపీ అభ్యర్థిగా సహకరించాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే

పోలాకి, అక్టోబరు 6 (వార్త): మబగాంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసు నాయుడు మంగళవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా దాసు నాయుడు తన తల్లి ఆదిలక్ష్మిని ఎంపీపీ అభ్యర్థిగా నిలిపే అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె అభ్యర్థిత్వానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విజ్ఞప్తిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలాకి మండలంలో రాజకీయంగా ఈ భేటీ చర్చనీయాంశంగా మారింది.

## మాజీ సర్పంచ్ పంచిరెడ్డి లింగమూర్తి మృతి



**జలుమూరు, అక్టోబరు 6 (వార్త):** నగిరికటకం మాజీ సర్పంచ్ పంచిరెడ్డి లింగమూర్తి సోమవారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కొంతకాలంగా ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు కృషి చేసినట్లు తెలిపారు. పంచిరెడ్డి లింగమూర్తి నగిరికటకం సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. అలాగే శ్రీముఖలింగేశ్వర దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ప్రసాదరావు సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఎదిగిన పంచిరెడ్డి లింగమూర్తి పార్టీ కార్యకర్తగా కూడా సేవలందించారని వారు పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి, స్థానిక ప్రజలకు తీరని లోటని ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నగిరికటకంలో మంగళవారం పంచిరెడ్డి లింగమూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంచాయతీతో పాటు శ్రీముఖలింగం దేవస్థానం అభివృద్ధికి లింగమూర్తి చేసిన సేవలను పలువురు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

## ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షపై ఎంఈవో పరిశీలన



**జలుమూరు, అక్టోబరు 6 (వార్త):** జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షల తీరును మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు మంగళవారం పరిశీలించారు. గొల్లపేట, టెక్కలిపాడు, పాగోడు పాఠశాలలను సందర్శించిన ఆయన పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలు నిర్ణీత నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో సూచించారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించి, పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టెక్కలిపాడు పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు



**నరసన్నపేట, అక్టోబరు 6 (వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విద్యార్థుల ఎంపిక వివరాలను వెల్లడించారు. పాఠశాల నుంచి ఒకేసారి ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు గర్వకారణమని హెచ్ఎం పేర్కొన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతున్నాయని, ఎంపికైన తమ పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని ఆమె వివరించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి, పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ముంజువానిపేటలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



**సారవకోట, అక్టోబరు 6 (వార్త):** చిన్నగుజ్జువాడ గ్రామపంచాయతీ పరిధిలోని ముంజువానిపేట గ్రామస్తుల అభ్యర్థన మేరకు మూడు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు జమానా నీలయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, సారవకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు ధర్మాన తేజ్‌కుమార్ తన సొంత నిధులతో ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. తన తల్లి స్వర్గీయ ధర్మాన ఉమావతమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.13 వేల వ్యయంతో మూడు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు నీలయ్య తెలిపారు. గ్రామంలో ప్రజలు కూర్చునేందుకు అనువుగా ఉండేలా బెంచీలను ఏర్పాటు చేయడంతో స్థానికులకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించి స్పందించి బెంచీల ఏర్పాటుకు సహకరించిన ధర్మాన తేజ్‌కుమార్‌కు గ్రామపంచాయతీ నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546